


**E-ISSN:** 2706-8927
**P-ISSN:** 2706-8919
www.allstudyjournal.com
IJAAS 2021; 3(3): 229-235
Received: 18-04-2021
Accepted: 21-06-2021

**డా॥ వి. నారాయణప్ప**
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆధునిక భారతీయ భాషలు,
మరియు సాహిత్య
అధ్యయన శాఖ, ఢిల్లీ
విశ్వవిద్యాలయం, ఢిల్లీ,
ఇండియా

**Corresponding Author:**
**డా॥ వి. నారాయణప్ప**
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆధునిక భారతీయ భాషలు,
మరియు సాహిత్య
అధ్యయన శాఖ, ఢిల్లీ
విశ్వవిద్యాలయం, ఢిల్లీ,
ఇండియా

# ప్రసారాంగం - ఉద్దేశం

**డా॥ వి. నారాయణప్ప**

**అమూర్త**

విశ్వవిద్యాలయాలు తన లక్ష్యసాధన కోసం వివిధ కార్యకలాపాల్ని కొనసాగిస్తుంటాయి. ఆ కార్యకలాపాల్ని మూడు ప్రధాన అంశాలుగా విభజించవచ్చు. అవి: 1. పరిశోధనాంగం, 2. బోధనాంగం, 3. ప్రసారాంగం. ఈ మూడు అంగాలు మూడు కోణాల్లో తమ తమ కార్యకలాపాల్ని నిర్వహిస్తుంటాయి. వీటిలో ప్రసారాంగం పాత్ర కూడా ప్రముఖమైనదే కాబట్టి, దీని ధ్యేయోద్దేశాలను, కార్యకలాపాలను ఇందులో చర్చించాను. మొదట ప్రసారాంగం అర్థాన్ని - పద వ్యాప్తిని కూడా చర్చించాను. చివరిలో స్వయం పరిపాలనా ప్రతిపత్తి గల కేంద్ర సాహిత్య అకాడమీ కార్యకలాపాలనూ చర్చించాను, గమనించవచ్చును.

**కీలక పదాలు:** ప్రసారాంగం, పరిశోధనాంగం, బోధనాంగం, ప్రసూతి, విశేషోపన్యాసం, స్వయం ప్రతిపత్తి, కార్యక్షేత్రం

## ప్రసారాంగం `అర్థం` పదవ్యాప్తి

ప్రసార + అంగం అనే రెండు పదాలు కలిసి ప్రసారాంగం అయ్యింది. నిజానికి ఇది సంస్కృత పదం. 'ప్రసారము' అంటే వ్యాపనము, వ్యాపించుట అనీ, 'అంగము' అంటే భాగము అని సూర్యరాయాంధ్ర నిఘంటువులో అర్థం ఇవ్వబడింది. 'ప్రసారాంగం' అనే ఈ సమాస పదానికి తెలుగు నిఘంటువుల్లో అర్థం కనిపించడం లేదు. కాని, ప్రొ.జి.వెంకట సుబ్బయ్యగారి 'కన్నడ క్లిష్ట పదకోశం'లో 'ప్రసారాంగ' అనే పదానికి '(విశ్వవిద్యానిలయగళల్లి విశేషవాగి) సాహిత్య మత్తు సంస్కృతియ ప్రసారక్కాగి ఇరువ విభాగ' అని ఉంది. అంటే (విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేకంగా) సంస్కృతి సాహిత్యాల ప్రసారం కోసం పని చేసే విభాగం అని అర్థం. ఈ అర్థం కొంత సమంజసంగా ఉంది. నిజానికి విశ్వవిద్యాలయాల్లో ప్రచారోపన్యాసాల ద్వారా, ప్రచురణల ద్వారా, సామాన్యులకు కూడా విశ్వవిద్యను పరిచయం చేయటం కోసం ఏర్పడిన విభాగమే

'ప్రసారాంగం' అని చెప్పవచ్చు. ఈ 'ప్రసారాంగం' అనే పదం కర్నాటక రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో మాత్రం ప్రయోగంలో ఉంది. ఈ పద వ్యాప్తిని తెచ్చినవారు కన్నడ కవి కువెంపు అని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ పద ప్రయోగం ఒక్క ద్రావిడ విశ్వవిద్యాలయంలో తప్ప తెలుగు రాష్ట్రాల్లోని ఏ విశ్వవిద్యాలయంలోనూ కనిపించదు. దీనికి సమానార్థకంగా 'ప్రచురణల విభాగం' అనే పదం వాడుకలో ఉంది. ఈ పదానికి తమిళంలో 'పదిప్పు తురై" అనీ, మలయాళంలో ప్రసాదక విభాగం అనీ, హిందీలో 'ప్రకాశన్ ప్రభాగ్' అనీ, ఇంగ్లీషులో 'Publication Division' లేదా 'Publication Department' లేదా 'Publication Wing' అని వాడుకలో ఉన్నాయి.

విశ్వవిద్యాలయాలు తన లక్ష్యసాధన కోసం కొన్ని కార్యకలాపాల్ని కొనసాగిస్తుంటాయి. ఆ కార్యకలాపాల్ని మూడు ప్రధాన అంగాలు (భాగాలు)గా విభజించవచ్చు. అవి:1.పరిశోధనాంగం, 2. బోధనాంగం, 3. ప్రసారాంగం. ఈ మూడు అంగాలు మూడు కోణాల్లో తమ తమ కార్యకలాపాల్ని కొనసాగిస్తుంటాయి. మొదటిదైన పరిశోధనాంగం స్నాతకోత్తర విద్య తరువాతి వ్యాసాంగానికి సంబంధించిన ఉన్నత స్థాయి పనిని నిర్వహిస్తుంది. రెండవదైన బోధనాంగం ఈ తరంవారు సుసంస్కృతులై, నాగరికులై, విద్యావంతులై ఈ పోటీ ప్రపంచంలో సమస్పర్థులై ఎలా బతకాలో నేర్పించడం దీని పని. మూడవదైన ప్రసారాంగం ఈ రెండు అంగాలకంటే ముఖ్యమైనదని చెప్పవచ్చు. ఇది విశ్వవిద్యాలయానికి జీవనాడివంటిది. ఎందుకంటే, దీని ధ్యేయోద్దేశాలు, పనులు అలాంటివి. విశ్వవిద్యాలయాల్లోని ఈ ప్రసారాంగ కార్యక్రమం ద్విముఖమైనటువంటిది. వాటిలో మొదటిది ప్రచారోపన్యాసం, రెండవది ప్రచురణ.

**ప్రచారోపన్యాసాలు**

ప్రచారోపన్యాసాల కార్యక్రమాలు సర్వ సామాన్యంగా ప్రతి విశ్వవిద్యాలయంలోనూ కొనసాగుతుంటాయి. ఇందులో ప్రజలున్న చోటుకే వెళ్ళి ఉపన్యాసాలిచ్చి, వాటిని ముద్రించి, తక్కువ ధరకు అందించడమే దీని ప్రధానోద్దేశం. మన దేశంలో విద్యార్థులు ఎక్కువ శాతం ప్రాథమిక విద్యాభ్యాసం చివర్లో తమ విద్యాభ్యాసాన్ని నిలిపివేస్తారు. కొంత మంది ప్రాథమికోన్నత పాఠశాల మధ్యలోనో చివర్లోనో వదలిపెడతారు. హైస్కూలు విద్యాభ్యాసాన్ని ముగించిన వెంటనే మరికొంతమంది చదువు ఆపివేస్తారు. ఇలా కాలేజీ స్థాయికి రావడానికి అర్హత పొందేవారి సంఖ్య చాలా తక్కువ. వీళ్లలో కూడా చాలామంది పేదరికానికి గురై విశ్వవిద్యాలయాల్లో ప్రవేశించడం లేదు. ఇలా దేశంలోని చాలా మంది విశ్వవిద్యాలయాల్ని ప్రవేశించి సాహిత్య, సంస్కృతి విజ్ఞాన విషయాల్లో నిష్ణాతులు కాలేకపోతున్నారు. అలాంటి వారికి విశ్వవిద్యాలయ ప్రచారోపన్యాసాలు జ్ఞానదీపాలు కాగలవనే ఉద్దేశంతో సామాన్య ప్రజల్లో జ్ఞాన ప్రసారం చేసే కార్యక్రమాన్ని ఈ ప్రచారోపన్యాసశాఖ చేపడుతుంది. ఈ ప్రచారోపన్యాసాల కార్యక్రమంలో సామాన్య ప్రజల కోరిక మేరకు విశ్వవిద్యాలయ అధ్యాపక వర్గంలో కొంతమంది ప్రజలు ఉన్న చోటుకే వెళ్ళి, వినోద కార్యక్రమాలు, కావ్యపఠనం, నాటక పఠనం మొదలైన వాటితో ప్రజల్ని ఆకర్షించి, ఉత్తమ ఉపన్యాసాల్ని ఇస్తారు. ఈ ఉపన్యాసాలు ప్రాచీన కావ్యాల్ని గురించేకాక, ఆయా భాషల్లో పరిణితు లైనవారు సంబంధించిన విషయాల్ని గురించి ఉపన్యసిస్తారు. దీనివల్ల అక్కడి ప్రజలకు మన సాహిత్య పరిచయంతోపాటు ఇతర భాషా సాహిత్యాల పరిచయం కూడా కలుగుతుంది. వీటికి తోడుగా ఆధునిక విజ్ఞాన విషయాలు, ప్రసూతి, శిశుసంరక్షణ, కన్ను దాని రక్షణ మొదలైన వైద్యకీయ విషయాల్ని కూడా అందరికి తెలిసేటట్లు సులభమైన భాషలో ఉపన్యసించి రాసి

ఇస్తారు. అజ్ఞానుల, అక్షరాస్యుల హృదయాల్లో జ్ఞాన జ్యోతి వెలిగింపజేసే ఈ కార్యక్రమం వల్ల క్షీణించిపోతున్న సంస్కారాల్ని ఉద్దీపనం చేయడానికి సహాయ పడుతుందని చెప్పవచ్చు.

**ప్రచార పుస్తకమాల**

ప్రచారోపన్యాసాల్ని అన్నింటినీ అందరూ వినడానికి వీలుపడదు. విశ్వవిద్యాలయానికి ఎంత ఉత్సాహముండినా దేశంలోని ప్రతి పల్లెకూ వెళ్ళి ఉపన్యాసాల్ని ఏర్పాటు చేయడం అసాధ్యం. కాబట్టి, ఈ ఉపన్యాసాల్ని వినడానికి వీలుపడని వారు వీటి ప్రయోజనాల్ని పొందడానికి వీలుగా ఈ ప్రచారోపన్యాసాల్ని చిన్న చిన్న చేతిపుస్తకాల రూపంలో ప్రచురించి, చాలా తక్కువ ధరకు అమ్మడానికి ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ ప్రచారపుస్తకమాలలో నిజానికి వీటి ము ద్రిత ఖర్చులు కూడా వీటి అమ్మకంవల్ల రావు. వీటి ఉద్దేశం డబ్బు సంపాదించడం కాదు. ప్రజల్లో జ్ఞాన ప్రసారం చేయటం. ఇలాంటి ప్రచార పుస్తకమాలలు మైసూరు, బెంగుళూరు, కర్నాటక విశ్వవిద్యాలయాల్లో కనిపిస్తాయి. మైసూరు విశ్వవిద్యాలయంలో 1995 నాటికి ఈ ప్రచార పుస్తకమాల కింద 262 పుస్తకాలు ప్రచురించారు. ఈ పుస్తకం ధర కూడా కేవలం రూ. 1.00 (ఒకరూపాయి) మాత్రమే. బెంగుళూరు విశ్వవిద్యాలయంలో 2005 నాటికి ఈ ప్రచారోపన్యాసమాల కింద 84 పుస్తకాలు ముద్రించారు. వీటి ధర కూడా కేవలం 25 పైసలు నుండి 25 రూపాయల దాకా ఉన్నాయి. కర్నాటక విశ్వవిద్యాలయంలో 1999 నాటికి ఉపన్యాసగ్రంథమాల కింద 482 పుస్తకాలు వెలుగు చూశాయి. వీటి ధర కేవలం రూ. 4.00 (నాలుగు రూపాయలు) మాత్రమే. ఇలా సాహిత్యం, సాంఘిక శాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్యం, శిల్పం, నృత్యం మొదలైన వివిధ విషయాల్ని గురించి ఈ పుస్తకమాల కింద వచ్చిన పుస్తకాలు అత్యంత ప్రజాదరణ పొంది లక్షల కొద్ది పుస్తకాలు అమ్ముడు పోతాయి. నిజానికి 1916లో స్థాపించబడిన మైసూరు విశ్వవిద్యాలయంలో 1933లో స్థాపించబడిన అధ్యాపకుల సంఘం ప్రచారోపన్యాసాల్ని విశ్వవిద్యాలయ ఆశ్రయంలో ప్రారంభించింది. ఈ ఉపన్యాసాలు చిన్న చిన్న పుస్తకాల రూపంలో ప్రచురింపబడి ప్రజాదరణ పొందిన విషయం ఇంగ్లాండు దేశం వరకూ వ్యాపించింది. 1934లో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల సమ్మేళనం ఆక్స్‌ఫర్డ్ లో జరిగి నప్పుడు అప్పటి మైసూరు మహారాజా కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య జె.సి.రాలోగారు మైసూరు విశ్వవిద్యాలయం ప్రతినిధిగా వెళ్ళారు. అక్కడ ప్రచారోపన్యాసాల కొత్త ప్రయోగాన్ని గురించి సభలో వివరించినప్పుడు సమ్మేళనానికి వచ్చిన దేశవిదేశాల ప్రతినిధులు చాలా మెచ్చుకొన్నారట. ఈ ప్రయోగాన్ని 'మైసూరు ప్రయోగం' అనే పిలిచేవారు. ఈ ప్రయోగం ఆ తరువాత కొత్తగా ఏర్పడిన విశ్వవిద్యాలయాలకి మార్గదర్శకమైందని చెప్పవచ్చు.

**విశేషోపన్యాస పుస్తకమాల (Special Lecture Series)**

విశ్వవిద్యాలయాల్లో ప్రసారాంగం 'ప్రచార పుస్తకమాల'లో పుస్తకాల్ని ప్రచురించినట్లే 'విశేషోపన్యాస పుస్తకమాల'లో కూడా పుస్తకాల్ని ప్రచురిస్తుంది. విశ్వవిద్యాలయాల్లో ప్రవేశావకాశం లేనివారికీ, సామాన్య గ్రామీణ ప్రజలకోసం ప్రచారోపన్యాసాలున్నట్లే విశ్వవిద్యాలయ వివిధ కాలేజీల్లోని విద్యార్థుల, అధ్యాపకుల ప్రయోజనం కోసం విశేషోపన్యాసాల్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. దేశ విదేశాల నుండి విద్యానైపుణ్యంగల ఆచార్యవర్యుల్ని అప్పుడప్పుడు ఆహ్వానించి, వారి ఉపన్యాసాల్ని ఏర్పాటు చేసి, వాటి ద్వారా పరస్పర అవగాహనకు, విషయ వినిమయానికి అవకాశం కల్పించడం ఈ

ఉపన్యాసోద్దేశం. ఇలా చేయడంవల్ల వేర్వేరు విశ్వవిద్యాలయాలు ఏ దిశగా పనిచేస్తున్నాయి? ఇక ముందు జరగాల్సిన పని ఏమిటి? దాన్ని ఎలా కార్యరూపంలోకి తీసుకురావచ్చును? ఇలాంటి విషయాలను తులనాత్మకంగా పర్యాలోచన చేయడానికి సులభ సాధ్యమవుతుంది. ఈ విశేషోపన్యాస పుస్తకమాల ఉపన్యాసాలు ప్రాంతీయ భాషల్లోనూ, ఇంగ్లీషు భాషలోనూ జరుగుతాయి. ఈ ఉపన్యాసాల్ని అచ్చువేసి ఈ మాలలో ప్రచురిస్తారు. ఇటీవల భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రధాన భాషా సాహిత్యాల విస్తృత పరిచయాన్ని ఉపన్యాసాల ద్వారా ఏర్పాటు చేసి వాటిని ప్రచురించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

మన సోదర భాషల్లో ఏయే ప్రయోగాలు జరుగుతున్నాయి? ఎలా జరుగుతున్నాయి? అనే విషయాలు తెలుసుకోవడం కేవలం కుతూహల శమనం కోసమేకాక, మన సాహిత్య తుష్టిని - పుష్టిని సాధించడానికి ఇవి సహాయపడవచ్చు అని చెప్పవచ్చు.

## పాఠ్య పుస్తకమాల

ప్రసారాంగం 'పాఠ్యపుస్తకమాల' అనే శీర్షిక కింద ప్రాంతీయభాషా మాధ్యమం సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని విశ్వవిద్యాలయ విద్యాభ్యాసాన్ని పొందగోరే విద్యార్థులకోసం పాఠ్యపుస్తకాలు ప్రచురించ బడుతుంటాయి. విశ్వవిద్యాలయాల్లో చాలా ఏండ్లు చదువు చెప్పి అనుభవమున్న అధ్యాపకుల చేత ఈ పాఠ్యపుస్తకాల్ని రాయించి ప్రచురించడం జరుగుతుంది. ఇలా ముద్రించిన పాఠ్యపుస్తకాలు ప్రాంతీయ భాషా మాధ్యమం విద్యార్థులకు మాత్రమే కాకుండా ఇంగ్లీషు మాధ్యమం విద్యార్థులకు కూడా ఉపయుక్తంగా ఉంటాయని చెప్పవచ్చు. ఈ పుస్తకమాలలో విశ్వవిద్యాలయం నిర్ణయించిన పాఠ్య ప్రణాళికానుసారం ప్రసారాంగమే పాఠ్యపుస్తకాలను ప్రచురించి అందించడంవల్ల పాఠ్యపుస్తకాలు లేవు అనే విమర్శ కూడా తక్కువవుతుంది.

## కన్నడ గ్రంథమాల

విశ్వవిద్యాలయాల్లో తమ ఆలోచనలకు అనుకూలంగా కొన్ని ధ్యేయోద్దేశాల సాధన కొరకు అనేక రకాలైన పుస్తకమాలలను ప్రసారాంగం ద్వారా తీసుకురావడం జరుగుతుంటాయి. ఇలాంటి ఆలోచనల ఫలితంగా మైసూరు విశ్వవిద్యాలయ ప్రసారాంగంలో కన్నడ సాహిత్యాన్ని అభివృద్ధిపరిచే ఉద్దేశంతో 'కన్నడ ప్రచురణ సమితి' ఉదయించింది. ఈ సమితి 'కన్నడ గ్రంథమాల'ను తీసుకురావడం జరిగింది. ఈ సమితిలో ఆధునిక కాలానికి కావాల్సిన సాహిత్యం, కళ, విజ్ఞానం, తత్త్వం, చరిత్ర, మతం, సంస్కృతి మొదలైన విషయాల్ని సులభశైలిలో ఆయా విషయాల్లో నిష్ణాతులైనవారు రాయాలని ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ విషయాలేకాక కన్నడంలోని ప్రాచీన సాహిత్యాన్ని ప్రజల్లోనూ, విద్యార్థివర్గంలోనూ ప్రచారంలోకి తీసుకురావడానికి ఉత్తమ కావ్య సంగ్రహాల్ని ప్రకటించాలని ఆశించారు. దీని ప్రకారం మూల ప్రతుల్ని పరిశీలించి రాయబడిన పీఠికలు, శబ్దకోశాలు, టిప్పణిలతో కూడిన కావ్య సంగ్రహాలు ప్రచురించబడ్డాయి. హరిశ్చంద్ర కావ్య సంగ్రహం, ప్రభులింగలీలా సంగ్రహం మొదలైన సాహిత్య సంగ్రహాలతోపాటు ఈ కన్నడ కావ్యమాలలో రాజనీతి శాస్త్రం, తత్త్వశాస్త్రం, అర్థశాస్త్రం, కావ్యమీమాంస మొదలైన అనేక విషయాలతో కూడిన పుస్తకాలు కూడా ప్రచురించారు.

ఈ గ్రంథమాలకు అపార జ్ఞానశక్తి కలిగినవారు, నిపుణులైనవారు పుస్తకాల్ని సులభశైలిలో రాసినప్పటికీ ప్రౌఢమైన విషయాలను కూడా కలిగి చాలా వరకు ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పవచ్చు.

మైసూరు విశ్వవిద్యాలయంలోనే 'సర్ కె.పి. పుట్టణ్ణ చెట్టిగారి పుదువట్టి ప్రచురణమాల' అనే మరో గ్రంథమాల కూడా ఒకటి కనిపిస్తుంది. ఈ ప్రచురణమాలలో 1959 నాటికి ఇరవై ఒక్క పుస్తకాలు ప్రచురించబడ్డాయి. వైజ్ఞానిక, వ్యావహారిక విషయాలకు సంబంధించిన జ్ఞానాన్ని సామాన్యుల్లో ప్రచారం చేయడానికి సులభగ్రాహ్య భాషలో చిన్న చిన్న పుస్తకాల్ని రాయించడం ఈ ప్రచురణమాల ఉద్దేశం. అప్పట్లో కీర్తిశేషులు సర్.కె.పి.పుట్టణ్ణ చెట్టిగారు ఈ విశ్వవిద్యాలయానికి తగిన ఆర్థిక సహాయాన్ని అందించి ఈ ప్రచురణమాలాభివృద్ధికి మహోపకారం చేశారు.

ఇదే విశ్వవిద్యాలయం నుండి 'ప్రబుద్ధ కర్ణాటక' అనే ఒక త్రైమాసిక పత్రిక కూడా ప్రచురితమయ్యేది. అందులో సాంఘిక, పౌరాణిక, చారిత్రక నాటకాలు, కథలు, కవితలు, సాహిత్య, విజ్ఞానశాస్త్ర సంబంధమైన విలువైన వ్యాసాలు ప్రచురించబడుతుండేవి. ఇది కేవలం కాగితపు ధర మాత్రమే. ఇది ఒకసారి చదివి బయట పడవేయాల్సిన ఇతర పత్రికల్లాంటిది కాదు. ఇది శాశ్వతంగా గ్రంథాలయంలో ఉంచుకోవల్సిన మంచి పత్రిక.

మైసూరు విశ్వవిద్యాలయ ప్రసారాంగంలో 'ప్రచార పుస్తకమాల', 'కన్నడ గ్రంథమాల', 'పార్యపుస్తకమాల', 'సర్.కె.పి.పుట్టణ్ణ చెట్టిగారి పుదువట్టి ప్రచురణమాల', 'విశేషోపన్యాస పుస్తకమాల', 'ఇతర ప్రచురణలు' మొదలైన గ్రంథమాలల కింద వేల సంఖ్యలో వివిధ గ్రంథాలు వెలుగు చూశాయి.

బెంగుళూరు విశ్వవిద్యాలయ ప్రసారాంగంలో 'పార్యపుస్తక మాల', 'ఆరోగ్యమాల', 'ఇంటికో మణిదీపమాల', 'కన్నడ అధ్యయన కేంద్రమాల', 'దత్తి మరియు విశేషోపన్యాసమాల 'ప్రచారోపన్యాసమాల', 'సామాన్యునికి సాహిత్య చరిత్రమాల', 'రజతోత్సవమాల' అనే గ్రంథమాలలతోపాటు 'సమగ్ర కన్నడ సాహిత్య చరిత్ర', 'ఇతర పుస్తకాలు' అనే శీర్షికల కింద 2005 నాటికి మొత్తం 673 పుస్తకాలు వెలుగు చూశాయి.

1991లో ఏర్పడిన హంపీ కన్నడ విశ్వవిద్యాలయంలోని ప్రసారాంగంలో 'విజ్ఞాన సంగతి' (మాసపత్రిక), 'పుస్తకమహతి' (కన్నడ పుస్తక సమీక్షలకు సంబంధించిన మాసపత్రిక), 'కన్నడ అధ్యయనం' (అర్థవార్షిక పత్రిక), 'చెలువ కన్నడ' (ఇది విశ్వవిద్యాలయ కార్యకలాపాలను తెలిపే మాసపత్రిక), 'మన కన్నడ' (ఇది కన్నడ భాషాభివృద్ధి కోసం ఏర్పడిన పత్రిక), 'కవికణజ' (అనియత కాల పత్రిక) మొదలైన పత్రికలు ప్రచురించబడుతున్నాయి. ఇవికాక 'Books for Neo Literates' గ్రంథమాల కింద 110 పుస్తకాల్నీ, 'ఇతర ప్రచురణలు' కింద 250 పుస్తకాల్ని ప్రచురించారు. 'మంటపమాల' అనే ఒక పుస్తకమాల (ఇది వివిధాంశాలకు సంబంధించిన పుస్తకమాల) కూడా సాగుతోంది.

ఇలాగే కర్నాటక విశ్వవిద్యాలయంలోనూ ఇలాంటి గ్రంథమాలలు వివిధోద్దేశాల సాధన కోసం కొనసాగుతున్నాయి. ఇదే దిశగా తెలుగు భాషా సాహిత్యాలు, సంస్కృతి, లలిత కళారంగాల్లో సమగ్ర వికాసం లక్ష్యంగా 1985 డిసెంబర్ 2న తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. బోధన, పరిశోధన, గ్రంథ ప్రచురణ, విస్తరణ సేవలను ప్రధాన కార్య క్షేత్రాలుగా చేసుకొని గత 37 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ విశ్వవిద్యాలయం తనకున్న పథకాల కింది తెలుగు భాష, సాహిత్య, సంస్కృతి రంగాల్లో రచయితలు, విమర్శకులు, తమ గ్రంథాలను ప్రచురించుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తూంటుంది. సాహిత్య క్షేత్రంలో వివిధ ప్రక్రియల్లో ప్రతి సంవత్సరమూ ఉత్తమ గ్రంథాలకు పురస్కారాలూ, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలూ, తెలుగు భాష, సాహిత్య,

సంస్కృతి, లలితకళారంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు రూ. 50,000/- లతో విశిష్ట పురస్కారం అందించి ప్రోత్సహిస్తూ ఉంటుంది. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సహాయం అందిస్తుంది. ప్రముఖుల పేర స్మారకోపన్యాసాలు నిర్వహిస్తుంది. వివిధ పథకాల కింద వివిధ విషయాలపై తెలుగులో విజ్ఞాన సర్వస్వాల సంకలనం జరిగింది. రాష్ట్రేతర, విదేశాంధ్రుల మాతృభాషా సంస్కృతుల పరిరక్షణకు కొన్ని పథకాల కింద కార్యక్రమాలు నిర్వహిస్తోంది. డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఆంగ్ల రచనలను తెలుగులోకి అనువదించి ప్రచురించే పథకం కింద ఇప్పటికే కొన్ని సంపుటాలు ప్రచురించారు.

తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, చరిత్ర, జానపద విజ్ఞానం మొదలైన అంశాల్లో ఇప్పటికే వందలాది గ్రంథాలను ప్రచురించింది. తెలుగు సాహిత్యంలో ప్రముఖంగా పేర్కొనదగిన ఆంధ్ర మహాభారత, భాగవత, రామాయణాలతోపాటు కావ్యాలు, ప్రబంధాలు, జీవిత చరిత్రలు, నిఘంటువులు, విమర్శ గ్రంథాలు, పదకోశాలు, సంగీత, నృత్యనాటక, జానపద కళాసాహిత్య గ్రంథాలు, ప్రత్యేక సంచికలను విశ్వవిద్యాలయం ప్రచురించింది. వ్యాపార దృష్టితోకాకుండా తక్కువ ఖర్చుతో సాధారణ పాఠకులకు, పరిశోధకులకు, భాషా సాహిత్య అధ్యయనపరులకు, విద్యార్థులకు, జిజ్ఞాసువులకు గ్రంథ సంచయాన్ని తెలుగు విశ్వవిద్యాలయం సమకూరుస్తున్నది. ఈ విశ్వవిద్యాలయం దేశం నలుమూలల జరిగే తెలుగు కార్యక్రమాలను క్రోడీకరించి విశ్వవిద్యాలయమే నడుపుతున్న 'తెలుగువాణి' అనే త్రైమాసిక సమాచార పత్రికలో ప్రచురిస్తోంది. అంతేకాకుండా దేశంలో నలుమూలల జరిగిన తెలుగు కార్యక్రమాలను తెలుగువారికి తెలియజేయు ఉద్దేశంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రేతర ప్రాంతాల్లో ప్రధానంగా విద్యాకేంద్రాల్లో పనిచేసే తెలుగు వారికి ఈ పత్రికను ఉచితంగా అందిస్తున్నారు.

పైన పేర్కొనబడిన అనేక ప్రాంతీయ ప్రచురణల విభాగాలు ప్రాంతీయ భాషకు సంబంధించిన సాహిత్యాన్ని మాత్రమే ప్రచురిస్తున్నాయి. అయితే దేశంలోని అన్ని భాషలకు సంబంధించిన ఉత్తమ సాహిత్యాన్ని ప్రచురిస్తూ, వీటిని ఇతర భాషలలోకి అనువాదం చేయిస్తూ, ఇతర భాషా సంస్కృతుల్ని కూడా తెలుసుకొనే అవకాశం కలిగిస్తున్న ఏకైక కేంద్ర ప్రభుత్వ సంస్థ కేంద్ర సాహిత్య అకాడమి.

విశ్వవిద్యాలయాలలాగే స్వయం పరిపాలనా ప్రతిపత్తిగల సంస్థగా కేంద్ర సాహిత్య అకాడమీని పేర్కొనవచ్చు. ఇది 1954లో స్థాపించబడింది. ఇండియాలో ప్రచురణ కార్యకలాపాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాయించుకొన్నది. సాహిత్యారంభదశ నుండి అనువాద ప్రక్రియ సాగుతున్నా, ఆధునిక యుగంలో భాషాసారూప్యతను పెంపొందించడానికి శక్తివంతమైన ఆయుధంగా నిలిచింది అనువాదం. నేటి అవసరాలను తీర్చడం కోసం సాహిత్యం, శాస్త్రం, సాంకేతికం, జనసంవాదం వంటి అనేక రంగాల్లో అనువాదం శాఖోపశాఖలుగా ఎదుగుతోంది. దేశవిదేశాలలోని ప్రజలు భావసారూప్యతా సాధనకు, భావ వినిమయానికి అనేక భాషల్లోని విషయాలని అభ్యసించవలసిన అవసరం ఏర్పడింది. ఈ తరుణంలో భావసారూప్యతకూ, దేశ సమైక్యతకూ నడుం బిగించిన కేంద్రసాహిత్య అకాడమీ తన లక్ష్య సాధనకు ఇరవై నాలుగు భారతీయ భాషలను గుర్తించి, ప్రాచీన భారతీయ ఉత్తమ సాహిత్య రచనలు మొదలుకొని నేటివరకు వచ్చిన అత్యుత్తమ రచనలనూ, విదేశ శ్రేష్ఠ సాహిత్య కృతులనూ అనువాదం చేయ సంకల్పించింది. తన ఆశయాల్ని నెరవేర్చుకునే ధ్యేయోద్దేశాలతో ఇరవైనాలుగు భారతీయ భాషల్లో 2007 నాటికి 4590 గ్రంథాలను ప్రచురించింది. ఒక్క తెలుగు భాషలోనే నవలలు, కథాసంకలనాలు,

నాటకాలు, కవితలు, సాహిత్య చరిత్రలు, భారతీయ సాహిత్య నిర్మాతలు, ఇతర గ్రంథాలు అన్నీ కలిపి మొత్తం 225 గ్రంథాలను ప్రచురించింది. అందులో కేవలం తెలుగు అనువాద గ్రంథాలే 197 ఉన్నాయి. అంతేకాకుండా ఈ సాహిత్య అకాడమీ ఇంగ్లీషులో 'Indian Literature' అనే ద్వైమాసిక పత్రికనూ, హిందీలో 'సమకాలీన భారతీయ సాహిత్య' అనే ద్వైమాసిక పత్రికనూ, సంస్కృతంలో 'సంస్కృత ప్రతిభ' అనే అర్ధవార్షిక పత్రికను కూడా కొనసాగిస్తోంది. ప్రధానంగా 24 భారతీయ భాషల్లోనైనా, లేదా ఇంగ్లీషులోనైనా ఐదేళ్ళ రచనానుభవం గల ఉత్తమ సాహితీలను గుర్తించి 25 వేల రూపాయలతో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును కూడా ఇస్తూ వుంటుంది. ఈ అవార్డును 1955లోనే ప్రవేశపెట్టింది.

నిజానికి దేశంలో సుదూర ప్రాంతాల్లోని సామాన్యులు కూడా విశ్వవిద్యాలయ ప్రయోజనాన్ని పొందినప్పుడు మాత్రమే విశ్వవిద్యాలయ ఉద్దేశం నెరవేరినట్లవుతుంది. లేకపోతే విద్యావంతులు, అవిద్యావంతులు అనే రెండు వర్గాలూ శాశ్వతంగా నిలిచిపోవడానికి అవకాశముంది. జ్ఞాన ప్రసారానికి సంబంధించిన ఈ ఉద్దేశం పెద్ద ఎత్తున కొనసాగడానికి ప్రసారాంగ కార్యక్షేత్రం ప్రతి విశ్వవిద్యాలయంలోనూ చురుగ్గా పని చేసినప్పుడే సాధ్యమవుతుంది.

## ఈ పరిశోధన వ్యాసానికి ఉపయోగపడిన పుస్తకాలు

1. విశ్వవిద్యానిలయద ప్రసారాంగ, డా॥ కె.వి.పుట్టప్ప, మైసూరు విశ్వవిద్యాలయ, 1991 (కన్నడ).
2. ప్రసారాంగద ప్రకటణెగళు, బెంగుళూరు విశ్వవిద్యాలయం, 2005.
3. Books from Sahitya Academi, Delhi, 2007 (English).
4. Kannada University profile, Kannada University, Hampi.
5. సాహిత్య సంస్థలు, డా॥ ద్వాదశి నాగేశ్వరశాస్త్రి, అమలాపురం.
6. తుమ్మల సాహిత్యం - సంపాదకులు డా.ఏటుకూరి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, హైదరాబాదు, 1990.
7. తెలుగు దినపత్రికలు - భాషా సాహిత్య స్వరూపం, డా॥ జె.చెన్నయ్య, రవికిరణ్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2003.